క్లుప్తంగా

వైభవుడికి సుప్రభాత సేవ


ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. మేళతాళాల మధ్య అర్చకులు, భక్తులు ఆలయ ప్రదక్షిణ చేశారు. స్వామికి అభిషేకాల అనంతరం ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన సమర్పించారు. మధ్యాహ్నం 200 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వైభవుడికి సమర్పించారు. కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విజయ వేంకటేశ్వరుడికి విశేష పూజలు


ఊంజల్ సేవ చేస్తున్న అర్చకులు

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు అప్పయ్యనగర్‌లో కొలువైన శ్రీభూ సమేత విజయ వేంటేశ్వరస్వామికి ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని విశేషంగా అలంకరించారు. ఆలయంలో సహస్ర దీపాలంకరణ, ఊంజల్ సేవలు జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం పూజలనంతరం అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రోడ్డెక్కిన మురుగు నీరు


ద్వారకానగర్ ఆరో లైన్ రోడ్డులో మురుగు నీటి ప్రవాహం

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు ద్వారకానగర్ ఆరో లైన్ రహదారిలో యూజీడీ మ్యాన్ హోల్ లీకై మురుగు నీరు పొంగిపొర్లుతోంది. రోడ్డెక్కి మురుగు ప్రవహించడంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. భరించలేని దుర్వాసన వల్ల ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ ప్రాంతంలో రెండు రోజులకు ఒకసారి ఈ పరిస్థితి నెలకొంటోంది. జీవీఎంసీ యూజీడీ విభాగం అధికారులు సమస్యను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అన్నార్తులకు ఆహారం పంపిణీ


ఆహార పొట్లాలు అందుకున్న వారితో సంస్థ సభ్యులు

డాబాగార్డెన్స్: బ్రిక్‌వాల్ డెవలపర్స్ సంస్థ శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో అన్నార్తులకు ఆహారం పొట్లాలు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా సంస్థ ఎండీ గసాడా జెన్నిఫర్, సీఈవో ఏనుగంటి ధనరాజ్ మాట్లాడుతూ ప్రతి వారం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మానవ సేవే.. మాధవ సేవగా భావించి మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాస్టర్ మూర్తి జేమ్స్, జీవన్‌సూర్య, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

జనం కోసం

చెంతకే ఆధార్ సేవలు

- జోన్‌-5లో 10 కేంద్రాల ఏర్పాటు
- బయోమెట్రిక్, వ్యక్తిగత వివరాల అప్‌డేషన్‌కు అవకాశం


గణేష్‌నగర్‌-1 ఆధార్ కేంద్రంలో వివరాలు అప్‌డేట్ చేయించుకుంటున్న విద్యార్థినులు


సంజీవయ్య కాలనీ సెంటర్‌లో ఆధార్ సేవలు పొందుతున్న విద్యార్థులు

కంచరపాలెం: ఆధార్ కార్డు తీసుకుని పదేళ్లు దాటిన ప్రజలు బయోమెట్రిక్, చిరునామా వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. జీవీఎంసీ జోన్‌-5 పరిధిలోని 40 నుంచి 63 వరకు గల 24 వార్డుల్లోని సచివాలయాల్లో 10 ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. ఎంపిక చేసిన సచివాలయాల్లో ఆధార్ అప్‌డేషన్ సేవలను పొందవచ్చు. ఆధార్ కేంద్రాలను జెడ్సీ కృష్ణ పర్యవేక్షిస్తున్నారు. ఆయా ఆధార్ కేంద్రాల్లో ఎప్పుడైనా బయోమెట్రిక్, వ్యక్తిగత, చిరునామ వివరాలను అప్‌డేట్ చేసుకోవచ్చని ఆయన చెప్పారు.

జీవీఎంసీ జోన్‌-5లో ఆధార్ కేంద్రాల వివరాలు

వార్డు నం.	సచివాలయం కోడ్	ఏరియా	సెక్రటరీ పేరు	ఫోన్ నంబర్
43.	21086246	వెంకటేశ్వర న్యూకాలనీ	కె.మోహన్‌రావు	94936 32327
45.	21086625	నరసింహనగర్‌-3	కె.తేజేశ్వరరావు	97033 30393
47.	21086260	సంజీవయ్య కాలనీ	ఎస్.శివరాము	96520 96465
51.	21086287	అంబేడ్కర్ కాలనీ	జి.ప్రభాకర్	94943 10435
51.	21086289	మాధవధార-2	జి.వెంకటేష్	99667 14743
51.	21086290	గాంధీనగర్‌-3	ఎస్.పల్లవి	78426 23525
50.	21086294	వుడా కాలనీ	ఎస్.నరేంద్ర	81251 17262
57.	21086302	భవానీ గార్డెన్స్	హెచ్.రాజేశ్వరి	96663 67380
57.	21086303	గణేష్‌నగర్‌-1	ఎం.కుమారి	87906 98924
61.	21086340	ఇండస్ట్రియల్ కాలనీ-1	యు.చౌదరి	90523 36526

ప్రజలు వినియోగించుకోండి



జీవీఎంసీ జోన్‌-5కు సంబంధించి ఆధార్ అప్‌డేషన్ సేవలను ప్రజలు సద్వినియోగించుకోవాలి. చిరునామా, వ్యక్తిగత వివరాల్లో సవరణలకు అవకాశం కల్పించాం. సచివాలయాల్లో అందుబాటులోకి తీసుకొచ్చిన ఆధార్ కేంద్రాల్లో తప్పుఒప్పులను సవరించుకుని వివరాలను అప్‌డేట్ చేసుకోండి. ఆధార్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలున్నా జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేయండి.

– ఆర్.జి.వి.కృష్ణ, జోన్‌-5 కమిషనర్, జీవీఎంసీ

ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.రాజు

సీతమ్మధార: ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి శనివారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ సీతంరాజు విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు తనకు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు కంపా హనోకు, అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్లు సారిపల్లి గోవింద్, బర్కత్ అలీ, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, కె.కామేశ్వరి, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, చల్లా రజని, కె.వి.ఎన్.శశికళ, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, పార్టీ వార్డు అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల ముఖాముఖి నేడు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆడారి కిషోర్‌కుమార్

సీతంపేట: ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఎమ్మెల్సీ అభ్యర్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఉత్తరాంధ్ర విద్యావంతుల వేదిక కన్వీనర్ ఆడారి కిషోర్‌కుమార్ తెలిపారు. పబ్లిక్ లైబ్రరీలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సహాయత వెల్ఫేర్ సొసైటీతో కలిసి మొదటి సారిగా ఎన్నికల బరిలో పోటీపడుతున్న అభ్యర్థులతో ఓపెన్ డిబేట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధాన రాజకీయ పార్టీలు మద్దతు ఇస్తున్న అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్న సుమారు 38 మంది పాల్గొంటారని వెల్లడించారు. వారంతా తమ మ్యానిఫెస్టోను వివరిస్తూ ఈ చర్చా వేదికపై నుంచి కార్యాచరణ వివరిస్తారన్నారు. ముందుగా కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు. సమావేశంలో జ్ఞానానంద, వెంకటేష్, శ్రీధర్, వంశీ, అసిత పాల్గొన్నారు.

చివరి రోజు.. ప్రచార జోరు


25వ వార్డులో ప్రచారం చేసి కరపత్రం అందిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్


49వ వార్డులో గ్రాడ్యుయేట్లకు కరపత్రాలు అందిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

సీతంపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార పర్వం శనివారం సాయంత్రంతో ముగిసింది. చివరి రోజు నియోజకవర్గంలో జోరుగా ప్రచారం నిర్వహించారు. జీవీఎంసీ 25వ వార్డు 133 సచివాలయం పరిధి కనకమ్మ వీధిలో స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ప్రచారం చేశారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కరపత్రాలు అందజేశారు.

పట్టభద్రులందరికీ ఓటరు స్లిప్పులు..

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగిసిన సందర్భంగా 25వ వార్డు సీతంపేటలో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వార్డులో 1,200 మంది పట్టభద్రులు ఉన్నారని, సచివాలయాల వారీగా వారికి ఓటరు స్లిప్పులు అందాయో లేదో పరిశీలించాలని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వార్డు నాయకులకు సూచించారు. అందని పక్షంలో సంబంధిత సచివాలయ అడ్మిన్‌కు గాని, తన దృష్టికి గాని తేవాలన్నారు. సమావేశంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెంపటాపు నూకరాజు, వార్డు యూత్ ప్రెసిడెంట్ ఉప్పాడ సన్నీ, సీనియర్ నాయకులు సారిపిల్లి సంతోష్, పోతిబంతి హరికృష్ణ, బి.కోటేశ్వరరావు, బొమ్మాళి రవి, పువ్వాడ గోవిందమ్మ, నంబూరి పద్మ, బోనుల జయ, రావాడ వీరమ్మ, కనకరత్నం, బూత్ కన్వీనర్లు, మహిళలు పాల్గొన్నారు.

49, 51 వార్డుల్లో..

మద్దిపాలెం: జీవీఎంసీ 49వ వార్డు 280 సచివాలయం పరిధి సత్యనగర్, సూర్యనగర్‌-1 ప్రాంతాల్లో కార్పొరేటర్ అల్లు శంకరరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సుమారు 41 మంది గ్రాడ్యుయేట్లను కలిసి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఏఎంసీ డైరెక్టర్ ఐ.రవికుమార్, సోమేశ్వర శివాలయం బోర్డు చైర్మన్, సత్యనగర్‌-1 అధ్యక్షుడు ఎస్.వి.వెంకటరావు, ఆలయ ధర్మకర్త సీహెచ్ శ్యామల, సీహెచ్ నరసింగ్, ఆర్.వరలక్ష్మి, వెంకటలక్ష్మి, మున్నా, బి.శంకర్, కె.కిషోర్, బి.భాస్కర్, బి.నారాయణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

- 51వ వార్డు 286 సచివాయం పరిధి మాధవధార వుడా కాలనీ ఫేస్‌-1లో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఎన్నికల ప్రచారం చేశారు. ఓటర్ల వద్దకు వెళ్లి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ ప్రసూనారెడ్డి, మెట్ట దమయంతి, దిడ్డి రమేష్, శ్యామ్, లత, వై.వరలక్ష్మి, రాణి, గణేష్, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జనసేన మద్దతు కోరిన ఇండిపెండెంట్

మురళీనగర్: పార్టీలకతీతంగా తనకు మద్దతు తెలపాలని ఏయూ విద్యార్థి నాయకుడు, ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ కోరారు. శనివారం ఆయన జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గ నాయకులను మురళీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో కలిశారు. మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ, సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ జీఎస్ఎన్ రాజు, శ్రీకాకుళం అంబేడ్కర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సుధాకర్‌ల మద్దతుతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నట్లు హేమంత్ చెప్పారు. తనకు ఓటు వేసి గెలిపించాలని జనసేన ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి శివశంకర్, నాయకులు బొలిశెట్టి సత్య, సంకు వెంకటేశ్వరరావు, బొడ్డేపల్లి రఘు, మూగి శ్రీనివాస్ తదితరులను కోరారు. ఏపీ నిరుద్యోగ జేఏసీ విశాఖ అధ్యక్షుడు సనపల తిరుపతిరావు, శ్రీకాకుళం అధ్యక్షుడు ముదిలి సంతోష్, విజయనగరం అధ్యక్షురాలు పులి రాధికరాణి, రూపసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 9న హెచ్‌ఆర్‌సీ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న మంత్రి శ్యాంప్రసాద్

డాబాగార్డెన్స్: ఏప్రిల్ 9న డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మానవ హక్కుల కౌన్సిల్(హెచ్‌ఆర్‌సీ) సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని కౌన్సిల్ కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో భాగంగా మానవ హక్కుల పరిరక్షణలో పౌరుడి పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్న వారిని ఆహ్వానించి వారి సూచనలు, సలహాలు స్వీకరిస్తామన్నారు. సర్వసభ్య సమావేశానికి హైకోర్టు న్యాయమూర్తులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటుతోపాటు రాష్ట్ర గవర్నర్‌గా నియమితుడైన జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు మానవ హక్కుల పటిష్టతకు చేపట్టాల్సిన చర్యలపై నివేదిక అందజేయనున్నట్టు పేర్కొన్నారు. జూలై నాటికి 25 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా జాతీయ మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్‌లు, సభ్యులను ఆహ్వానించనున్నట్టు చెప్పారు. హక్కుల ఉల్లంఘనతో బాధితులైన వారి హక్కుల పరిరక్షణకు 25 ఏళ్లుగా కౌన్సిల్ పోరాడుతోందన్నారు. బాలలు, మహిళల హక్కులు, పర్యావరణ హక్కులపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. రాజకీయాలకతీతంగా హక్కుల పరిరక్షణకు శ్రమిస్తున్న వారిని మాత్రమే తమ సంస్థ ప్రోత్సహిస్తుందన్నారు. సమావేశంలో వీఎస్ఎన్ మూర్తి, ఎస్వీ రమణ, అబ్దుల్ సత్తార్, రావాడ నాయుడు, మాధవి గణపతి, నక్కాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

డాబాగార్డెన్స్: ఉగాది విశిష్ట ప్రతిభారత్న–2023 పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సర్వేజనా సుఖినో భవంతు సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పల్లెలు, పట్టణాల్లో ఉన్న కవులు, కళాకారులు, రచయితలు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, మేధావులు, వైద్యులు, సమాజ సేవకులు, ఆధ్యాత్మిక, యోగా గురువులు, కార్మికులు, కర్షకులు, క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ఉగాది విశిష్ట ప్రతిభా రత్న పురస్కారంతో ఈ నెల 26న హైదరాబాద్‌లో ఘనంగా సత్కరించనున్నట్టు పేర్కొన్నారు. ఆయా రంగాల్లో సేవలందిస్తున్న వారు తమ ప్రతిభను గురించి తెలియజేసే సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్.. గతంలో పొందిన పురస్కారాల సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలు దరఖాస్తుకు జత చేసి ఈ నెల 20వ తేదీలోగా సర్వేజనా సుఖినో భవంతు, 1–20–164, గోకుల్‌నగర్, వెంకటాపురం పోస్టు, తిరుమలగిరి, సికింద్రాబాద్‌–15 చిరునామాకు పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు 96523 47207 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

లలితా పీఠంలో సంకటహర చతుర్థి


పూజలందుకున్న గణపతి

సీతంపేట: సంకటహర చతుర్థి సందర్భంగా లలితానగర్ లలితా పీఠంలో శనివారం వినాయకుడికి ప్రత్యేక పూజలు, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. గణపతికి ప్రీతిపాత్రమైన తిథుల్లో చతుర్థి ఒకటని, మనుషులను కష్టాల నుంచి గట్టెక్కించే సంకటహర చతుర్థి వ్రతం ఎంతో విశిష్టమైనదని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ అన్నారు. పీఠం అర్చకుల మంత్రోచ్చారణల నడుమ దూప దీప నైవేద్యం, గణేశ స్తోత్రం, వ్రత కథ చదివారు. అనంతరం పీఠం దర్బారు హాల్లో శాస్త్రోక్తంగా గణపతి హోమం నిర్వహించారు. ఈ హోమం వల్ల కార్యసిద్ధి, ఆరోగ్యం, విజయం లభిస్తాయని అర్చకులు తెలిపారు. పంచమి సందర్భంగా ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు పీఠంలో వారాహి హోమం జరుగుతుందని కృష్ణసేస్ చెప్పారు.

అనాథ పిల్లలతో కాసేపు..


లీనా చారిటబుల్ ట్రస్ట్ పిల్లలతో క్లబ్‌ల ప్రతినిధులు

డాబాగార్డెన్స్: నిత్యం చదువు, పనులతో బిజీబిజీగా గడిపే వారంతా శనివారం అనాథ పిల్లలతో కలిసి ఉల్లాసంగా గడిపారు. ఆట, పాటతో వారిలో ఉత్సాహం నింపారు. మీకు మేమున్నామంటూ భరోసా కల్పించారు. రోటాట్రాక్ క్లబ్ వైజాగ్ కపుల్స్ ట్రాక్, సన్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ సహకారంతో నగరంలోని లీనా చారిటబుల్ ట్రస్ట్‌లో శనివారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పిల్లలకు న్యూట్రిషన్ ఫుడ్, భోజనం ఏర్పాటు చేశారు. అంతే కాకుండా 5, 7 లీటర్ల ప్రెజర్‌కుక్కర్లు అందజేశారు. కాసేపు వారితో ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో రోటాట్రాక్ చైర్‌పర్సన్ ఆర్‌టీఎస్ ఆశాజాస్తి, నిత్య జాస్తి, వీవీఎస్ ప్రవీణ్, ఎన్.శంకర్ పవన్, తోట శ్రీరామ్ విద్యార్థులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం...


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కంచరపాలెం: గొల్ల కంచరపాలెంలో కోదండ సీతారామ సంపత్ వేంకటేశ్వర స్వామి, ధనలక్ష్మి దేవి విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం సీతారాముల, సంపత్ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని శ్రీమాన్ రేజేటి శ్రీరామాచార్యులు నేతృత్వంలో అట్టహాసంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి కల్యాణాన్ని కనులారా వీక్షించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ స్వాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ అన్నసమారాధనను ప్రారంభించారు. గ్రామ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

14న సత్తమ్మతల్లి జాతర

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామ పొలిమేర దేవత సత్తమ్మతల్లి వార్షిక జాతరను ఈ నెల 14న నిర్వహించనున్నట్టు ఆలయ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు పి.వెంకటరావు శనివారం ఒక కార్యక్రమంలో తెలిపారు. భక్తులకు ప్రసాద వితరణ, మధ్యాహ్నం అన్నసమారాధన చేస్తున్నట్టు చెప్పారు. అభివృద్ధి కమిటీ సభ్యులు గంట్ల కనకరాజు, బలిరెడ్డి శ్రీనివాస్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహనీయురాలు సావిత్రిబాయి పూలే


సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సేన నాయకులు

కంచరపాలెం: మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం సావిత్రిబాయి పూలే అని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు కొనియాడారు. దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు పిలుపు మేరకు శనివారం ఊర్వశి జంక్షన్‌లోని కార్యాలయంలో సావిత్రిబాయి వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గొల్లమాల అప్పారావు మాట్లాడుతూ కుల వివక్షను రూపుమాపడంలో మహనీయురాలు సావిత్రిబాయి పూలే దంపతులు చేసిన పోరాటం గొప్పదన్నారు. సామాజిక సంస్కరణ ఉద్యమ కార్యకర్తగా, దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా ఆమె సేవలు అజరామరమని కీర్తించారు. కార్యక్రమంలో దళిత సేన నగర మహిళా కన్వీనర్ గొల్లమాల మీనా, పుచ్చ కామేశ్వరరావు, పట్నాల ఝాన్సీరాణి, తాటిపూడి సీతారామ్, రాణి, మల్లికార్జున్, రాంజీ అభ్యుదయ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మల్టీమీడియా సెంటర్ ప్రారంభం


త్రైపాక్షిక ఒప్పందంలో పాల్గొన్న ప్రముఖులు, పలు కళాశాలల ప్రిన్సిపాళ్లు

డాబాగార్డెన్స్: కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, రిటైలర్స్ అసోసియేషన్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల మధ్య త్రైపాక్షిక ఒప్పందంలో భాగంగా శనివారం విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన మల్టీమీడియా సెంటర్‌ను కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ప్రారంభించారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంపు, ఉద్యోగ అవకాశాలపై చర్చించారు. జాయింట్ అప్రెంటిషిప్ అడ్వైజర్ జేమ్స్ రాఫెల్ మాట్లాడుతూ దేశంలో విజయవంతమైన రిటైలర్స్ అసోసియేషన్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సమీర్ నరసాపూర్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి, పరాగ్ ఓలా మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్, డాక్టర్ పి.అనీల్‌కుమార్, పలు డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో విధులకు రెవెన్యూ ఉద్యోగులు

మహారాణిపేట: కలెక్టరేట్‌లో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది నిరసనలో భాగంగా శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. అనంతరం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సిహెచ్.వి.రమేష్, ఇతర నాయకులు రాజేంద్ర వర్మ, నాల్గో తరగతి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నమ్మి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పల్లకీలో జంట.. కనుల పంట



ఓ నవ జంట శనివారం పల్లకీలో ఊరేగుతూ కనువిందు చేసింది. సాధారణంగా పల్లెటూరిలో ఇటువంటి కమనీయ దృశ్యాలు కనిపిస్తాయి. నగరంలోని అప్పుఘర్‌లో బంధుమిత్రుల పరివారంతో పల్లకీలో ఊరేగుతున్న ఈ కొత్త జంటను చూసేందుకు వాహన చోదకులు, స్థానికులు ఉత్సాహం చూపించారు. – ఎంవీపీ కాలనీ